క్లుప్తంగా

సమతుల్య ఆహారం పంపిణీ

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని ఉప్పరపల్లె గ్రామంలో క్షయవ్యాధిగ్రస్తుడికి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సందీప్‌కుమార్ సమతుల్య ఆహారాన్ని అందించారు. టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా ఉప్పరపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని క్షయవ్యాధిగ్రస్తుడిని ఆయన దత్తత తీసుకున్నారు. ఈ మేరకు ఆదివారం ఆహార కిట్‌ను అందజేశారు. బాధిత వ్యక్తికి పూర్తి చికిత్సా కాలం ఆహారాన్ని అందించనున్నట్లు ఆయన తెలిపారు.

అంగన్‌వాడీ వర్కర్ల నిరసన

చాపాడు: స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఆదివారం మండలంలోని అంగన్వాడీ వర్కర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు సుజాత మాట్లాడుతూ.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుండా తమ నిరసనలపై ఎస్మా ప్రయోగించటం వెనక్కు తీసుకుని, తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు

మైదుకూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మైదుకూరులో కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్టు స్టార్స్ అసోసియేషన్ వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు మైదుకూరు జెడ్పీ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరుగుతాయని వారు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈనెల 9వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎ.చందు 6302095792, పి.కొండయ్య 9347579181, జి.సందీప్ 6303071471 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

నేటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో సోమ, మంగళ, బుధవారాల్లో రోజూ సాయంత్రం 6 గంటలకు ప్రవచనాలు ఉంటాయని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామమోహన్‌రావు తెలిపారు. స్పిరిట్యువల్ సైంటిస్ట్ శంకర తత్వార్థ రత్నకర బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ గురు, దైవ, వేద, వేదాంత విజ్ఞానం గురించి ప్రవచనాలు చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో నవోదయ గ్రాండ్ టెస్ట్



నవోదయ గ్రాండ్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

పోరుమామిళ్ల : ఎస్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం నవోదయ గ్రాండ్ టెస్ట్ నిర్వహించారు. స్థానిక ఎస్టీయూ రీజనల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో కాశినాయన, పోరుమామిళ్ల, కలసపాడు మండలాలకు చెందిన 36 మంది విద్యార్థులు పాల్గొన్నారని ఎస్టీయూ మండల అధ్యక్షుడు పుల్లయ్య తెలిపారు. ఈ టెస్ట్‌వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని, పరీక్షలపై అవగాహన కలుగుతుందని వారు తెలిపారు. 18 మంది ఇంగ్లీష్ మీడియం, 18 మంది తెలుగు మీడియంలో పరీక్ష రాశారు.


పరామర్శ



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : మూడు రోజుల క్రితం స్థానిక సిద్దవటం రోడ్డులో హత్యకు గురైన అన్నదమ్ములైన పసుపులేటి ప్రశాంత్, పసుపులేటి సాయికుమార్ కుటుంబ సభ్యులను ఆదివారం గాంధీనగర్‌లోని వారి నివాసంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పరామర్శించి హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే హత్యకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ ఓబుల్‌రెడ్డి, ఇన్‌చార్జిలు గురివిరెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను నేత్రవైద్యుడు గురుఅభిలాష్ ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీను ప్రభుత్వ బీసీ ఉద్యోగుల సమస్యలు, పరిష్కారాలపై చర్చించారు. కార్యక్రమంలో గౌరవ సలహాదారు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ బత్తల వెంకటసుబ్బయ్య, గౌరవ అధ్యక్షుడు చంద్రమౌళి, కార్యదర్శి అశోక్, కోశాధికారి రామారావు, ఉపాధ్యక్షులు వేల్పుల భాస్కర్, శివప్రతాప్, బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

వరదాయిని.. జగజ్జనని



పూల అలంకరణలో శ్రీ ఈశ్వరీదేవి మఠం



విద్యుత్ కాంతులీనుతున్న ముఖద్వారం

- కనుల పండువగా అమ్మవారి ఆరాధనోత్సవాలు
- మార్మోగిన ఈశ్వరీదేవి నామస్మరణ

బ్రహ్మంగారిమఠం : 'వర ప్రదాయిని.. జగజ్జనని' అంటూ భక్తులు శరణు వేడారు. 'కొలిచే వారి కొంగు బంగారమై నిలిచే తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడు' అంటూ భక్తి శ్రద్ధలతో ప్రార్థించారు. ఈశ్వరీదేవి మఠం జగన్మాత నామస్మరణతో మార్మోగింది. బ్రహ్మంగారిమఠంలోని శ్రీఈశ్వరీదేవి మఠంలో అమ్మవారి ఆరాధన గురుపూజ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఐదో రోజైన ఆదివారం పూర్వపు మఠాధిపతి వీరబ్రహ్మయ్యాచార్య సాముల వారి ఆరాధన నిర్వహించారు. ఉదయం ప్రభాత సేవ, అభిషేకం, బిల్వదళార్చన, గురుపూజ విధులు చేపట్టారు. మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాజేశ్వరిదేవి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ద్వార పూజ, నైవేద్యం, మంత్ర పుష్పం, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రామలు చేపట్టారు. రాత్రి గ్రామోత్సవం ఉత్సాహ భరితంగా జరిగింది. బ్రహ్మంగారిమఠానికి చెందిన శ్రీచిన్మయామిషన్ వారి గీతాపారాయణం భక్తులను అలరించింది. సోమిరెడ్డిపల్లె గ్రామం శ్రీ సీతారామభజన మండలి ఆధ్వర్యంలో చేపట్టిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జగన్మాత శ్రీఈశ్వరీదేవిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి, వొమ్మిన చిన్న ఈశ్వరయ్యశ్రేష్టి, మారంరెడ్డి రామనారాయణరెడ్డి, కడారు విశ్వనాథాచార్యులు, అంకిరెడ్డిపల్లె ఓబుల్‌రెడ్డి, తమిదల కోటిరెడ్డి, నొస్సం సుబ్రహ్మణ్యాచారి, పోలు పోలేటమ్మగారి సుబ్బారెడ్డి, బాల హుస్సేన్‌రెడ్డి, కోడూరి సుబ్రహ్మణ్యాచారి, యాకశిరి జయలక్షుమ్మ, కల్లూరి కేశవాచారి, మహేశ్వరాచారి, నాగరత్నామాచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కళకళ

బ్రహ్మంగారిమఠంలోని ప్రముఖ దర్శనీయ స్థలాలు ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తులతో కళకళలాడుతున్నాయి. అమ్మవారి ఆరాధనోత్సవాలకు వచ్చిన వారు పరిసర ప్రాంతాల్లోని ఆలయాలను దర్శించుకుంటున్నారు. శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి మఠం, స్వామి వారి నివాస గృహం, పోలేరమ్మ చేత నిప్పు తెప్పించిన రచ్చబండ, పోలేరమ్మ గుడి, కక్కయ్య మఠం, బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు, ఈశ్వరీదేవి తపస్సు చేసిన గుహ, సిద్దయ్య మఠం, అక్కంపేటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయం(విభూది లింగం), మద్దాయత్రి విశ్వకర్మ వంశవృక్ష దేవాలయం, రామాలయం (భజన మందిరం) తదితర ప్రాంతాలను సందర్శించారు.



గీతాపారాయణం ఆలపిస్తున్న బ్రహ్మంగారిమఠం చిన్మయామిషన్ వారు

దివ్యాంగులకు దోమతెరల పంపిణీ



దోమతెరలను అందిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్‌రావు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ గవర్నర్ జొన్నలగడ్డ రామచంద్రప్రకాష్ రావు జన్మదినం సందర్భంగా ఆయన మనవడు అశుతోష్ మౌళి, పవన్ కుమార్ 75 మంది దివ్యాంగులకు దోమ తెరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జొన్నలగడ్డ రామచంద్ర ప్రకాష్‌రావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా 47 ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, గౌరవాధ్యక్షుడు చలపతిరావు ఆధ్వర్యంలో రామచంద్రప్రకాష్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రామలింగేశ్వర, సత్యనారాయణ, కిరణ్ కుమార్, లలిత గుప్తా, అబ్దుల్ రషీద్, సంజీవ్ హనుమంత్, సావిత్రి, లక్ష్మీదేవి, జాషువా తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో రాణించాలి



కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కూచిపూడి నాట్యంలో మెళకువలు నేరర్చుకుని రాణించాలని కేంద్ర సంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీత డాక్టర్ వసంత్ కిరణ్ పేర్కొన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయ కల్యాణ మండపంలో నృత్య తరంగిణి కళా నిలయం ఆధ్వర్యంలో భరత కళా వసంతం పేరుతో వర్క్‌షాప్ నిర్వహించారు. కూచిపూడి నాట్యంలో జూనియర్, సీనియర్ విభాగంలో విద్యార్థులకు అడుగులు, జతులు, తాళాలు, నట్టువాంగం, సంగీతం, కృతి, జాలంధరంలతో పాటు నాట్యంలోని పలు అంశాలను, మెళకువల్లో శిక్షణ ఇస్తున్నారు. కూచిపూడి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రీ పాల్గొని కూచిపూడి నృత్య ప్రాముఖ్యతను, శాస్త్రపాఠాలను వివరించారు. కార్యక్రమంలో నృత్య తరంగిణి కళానిలయం నిర్వాహకుడు టి.శ్రవణ్‌కుమార్, రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, కేరళ ప్రాంతాలకు చెందిన నాట్యగురువులు, విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా సోమవారంతో వర్క్‌షాప్ ముగియనుంది.

అంతరిక్షరంగంలో గొప్ప విజయం

ప్రొద్దుటూరు కల్చరల్ : అంతరిక్షంలో ఆదిత్య ఎల్–1 ఉపగ్రహం తన గమ్యానికి చేరుకోవడం అంతరిక్షరంగంలో మనదేశం సాధించిన గొప్ప విజయమని ఉపాధ్యాయసంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉపగ్రహాన్ని సెప్టెంబరులో ప్రయోగించారని, సుమారు 15 లక్షల కిలోమీటర్లు ప్రయాణించి తన గమ్యానికి చేరుకుందని ఆయన పేర్కొన్నారు. సూర్యుని రహస్యాలను తెలుసుకునే ఈ ఉపగ్రహం రూపొందించిన శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

ప్రొద్దుటూరు : స్థానిక వినాయకనగర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, రామసేవకులు ఆదివారం ఇంటింటికీ తిరిగి అయోధ్య శ్రీరాముని అక్షింతలు, అయోధ్య శ్రీరామ మందిరం చిత్రపటం అందించారు. ఈ నెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ శివప్రసాద్, విభాగ్ భౌతిక ప్రముఖ్ ప్రసాద్, జేష్ట స్వయం సేవక్ నరసింహులు, భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శివకుమార్, పరమేశ్వరరావు, ముత్యాల శ్రీశ్రీ, చంద్రమోహన్, శివరాజు, శ్యామ్, మధు, సంజయ్, మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు హామీ నిలబెట్టుకోవాలి

పోరుమామిళ్ల : సీపీఎస్ రద్దు హామీని నిలబెట్టుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా డిమాండ్ చేశారు. పోరుమామిళ్ల ఎస్టీయూ రీజనల్ భవన్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల ప్రదేశ్ రాష్ట్రాలు అమలు చేశాయన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియ ఉపసంహరించుకోవాలన్నారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని వెదురూరు గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే ఈ శిబిరంలో సచివాలయ పరిధిలోని ప్రజలందరూ వైద్య పరీక్షలు చేయించుకుని మందులు పొందవచ్చన్నారు. ఇదే క్రమంలో ఇక్కడ ప్రముఖ వైద్యుల సూచనల మేరకూ జిల్లా స్థాయి ఆసుపత్రులలో సైతం చికిత్స చేయించుకోవచ్చని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



10 సెంట్ల రిజిస్టర్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ, మండలంలోని పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదివారం ప్రారంభించారు. మున్సిపాలిటీలోని 2వ వార్డు రజకుల కోసం రూ.25 లక్షలతో పెన్నానది ఒడ్డున నిర్మించిన దోబీ ఘాట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2వ వార్డు కౌన్సిలర్ ద్వార్శల భారతి విజ్ఞప్తి మేరకు రామేశ్వరం నుంచి ఆర్టీపీపీకి వెళ్లే దారిలో పెన్నానదిలో మున్సిపల్ సాధారణ నిధులతో దోబీఘాట్‌ను నిర్మించామన్నారు. దీంతో దాదాపు 70 కుటుంబాల రజకుల సమస్య పరిష్కారమైందన్నారు. గతంలో సోములవారిపల్లెలో ఉండే రజకుల కోసం దోబీఘాట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది తామేనన్నారు. తాను కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు మున్సిపల్ సమావేశంలో దోబీఘాట్లకు అయ్యే విద్యుత్ బిల్లులను మున్సిపాలిటీ చెల్లించేలా పోరాటం చేసి సఫలీకృతం అయ్యామన్నారు. భవిష్యత్తులో రజకులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. రజకులకు గతంలో ఇచ్చిన మాట మేరకు కల్యాణ మండపం కోసం అవసరమయ్యే 30 సెంట్ల స్థలాన్ని తన సొంత నిధుల ద్వారా త్వరలో అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి, కౌన్సిలర్ ద్వార్శల భారతి, కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు ద్వార్శల భాస్కర్‌రెడ్డి, ద్వార్శల గురునాథరెడ్డి, సచివాలయ కన్వీనర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

ప్రొద్దుటూరు మండలంలోని గోపవరం పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమిపూజ చేశారు. యానాది కాలనీలోని క్రైస్తవుల శ్మశాన వాటికకు వెళ్లే రహదారి కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. 4వ వార్డు విద్యాధరి హైస్కూల్ సమీపంలో ద్వారకా నగర్ రోడ్డు పైపులైన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా క్రైస్తవులు శ్మశాన వాటికకు వెళ్లేందుకు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి విజ్ఞప్తి మేరకు రూ.20 లక్షలతో నిర్మించే కల్వర్టు పనులకు భూమిపూజ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గోపవరం గ్రామ సర్పంచ్ గద్ద మోషా, మాజీ సర్పంచ్ దేవిప్రసాద్‌రెడ్డి, కొండయ్య, మేరి పాల్గొన్నారు.

చౌటపల్లెలో..

మండలంలోని చౌటపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రాచమల్లు కాలనీలో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజచేశారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లె సర్పంచ్ మార్తల చంద్ర ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, మండలాధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేషారెడ్డి పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్‌కు స్థలం విరాళం

ప్రొద్దుటూరు ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ నిర్మాణం కోసం రూ.40 లక్షల విలువైన 10 సెంట్ల స్థలాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విరాళంగా అందించి మరోమారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. స్థానిక దువ్వూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్యాలయానికి 3 సెంట్ల స్థలం ఇప్పించాలని కోరారన్నారు. వారి విన్నపం మేరకు దువ్వూరు రోడ్డులోని అభయాంజనేస్వామి ఆలయం ఎదురుగా రూ.40 లక్షల విలువైన 10 సెంట్ల స్థలాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. వారి సంక్షేమానికి, అభివృద్ధికి తానెప్పుడు ముందుంటానన్నారు. ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝూన్సీరాణి అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి తమ బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తాననడం సంతోషంగా ఉందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ అసోసియేషన్‌కు ఉచితంగా స్థలం కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లును వారు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝూన్సీరాణి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బాలసూర్యారావు, అధ్యక్షుడు నాయబ్ రసూల్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్ రాజు, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీతను అందరూ అర్థం చేసుకోవాలి



పట్టణ ప్రధాన రహదారిలో నగర సంకీర్తన



అల్లాడుపల్లెలో భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : ధనుర్మాస దీక్షలో భాగంగా ఆదివారం తెల్లవారు జామున గిరినగర్‌కాలనీ రామాలయం నుంచి పట్టణంలోని అమ్మవారిశాల వరకు 400 మంది మహిళలతో నగర సంకీర్తన జరిగింది. అనంతరం అమ్మవారిశాలలో జరిగిన ఆధ్యాత్మిక సమావేశంలో చిన్మయానంద మిషన్ మాతాజీ శ్రేయానంద సరస్వతి మాట్లాడుతూ మహిళల్లో ఆధ్యాత్మిక శక్తిని జాగృతం చేయడం దేశానికి అవసరమన్నారు. సర్వమానవాళి శ్రేయస్సు కాంక్షించి శ్రీకృష్ణుడు భగవద్గీత బోధించాడని అందరూ భగవద్గీతను అర్థం చేసుకోవాలన్నారు. 500 సంవత్సరాల పోరాట ఫలితంగా అయోధ్యలో రామాలయం నిర్మాణమైందని, శ్రీరాముడు మానవాళికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ రామతత్వాన్ని నింపుకోవాలని శ్రేయానంద సరస్వతి తెలిపారు. రాముని మార్గంలో నడిచినప్పుడు సమాజంలో సుఖశాంతులు వర్ధిల్లుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు కృష్ణవేణి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, సేవికా సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో భగవద్గీత గ్రంథ ప్రచారం

చాపాడు : మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథంపై ప్రబోధ సేవా సమితి, దుత్తలూరు ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ఇదే క్రమంలో భోగి, సంక్రాంతి పండుగ విశిష్టతలు, సంప్రదాయాలపై తెలియజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు ప్రసాద్, సభ్యులు సుధాకర్, పెంచలరత్నం, నరసింహులు, సలీం, భువనేశ్వరరెడ్డి, మహేంద్ర, రమణయ్య, వెంటక సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ ప్రవీణ్‌కుమార్

బి.కోడూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణలో ఎవరి ఓటు హక్కును వారు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అడిషనల్ ఎస్పీ (ఎలక్షన్ ఆఫీసర్) ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన పెద్దుళ్ళపల్లె గ్రామస్తులతో ఎన్నికలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో లేనిపోని ఆరోపణలు చేసుకుని వాదనలకు దిగి ఎంతో విలువైన జీవితాలను కేసుల మూలంగా నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఎన్నికలకు ముందు గ్రామంలోని పెద్దలను బైండోవర్ చేయడం జరుగుతుందని, బైండోవర్ మూలంగా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది కేవలం ముందు జాగ్రత్తగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు మాత్రమేనని తెలిపారు. ఎన్నికల రోజు మాత్రమే ఎవరి ఓటును వారు వినియోగించుకుని మిగతా సమయాల్లో ప్రతిఒక్కరు స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. సదస్సులో గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్, బి.కోడూరు ఎస్ఐ కత్తి వెంకటరమణ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



బహుమతులు అందిస్తున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలో ఆంధ్రప్రదేశ్ కడప అసోసియేషన్ ఫర్ డెఫ్ వారి ఆధ్వర్యంలో ఆదివారం సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బధిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకిశోర్, ప్రధాన కార్యదర్శి ఇర్ఫాన్, ధనలక్ష్మి, ఏపీ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, శరత్, రత్నాలు, శ్రీకాంత్, ప్రసన్న కుమార్, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, క్లాప్ డ్రై వర్లకు రూ.18 వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సాల్మన్, చంటి, విజయకుమార్, రాఘవ, మోహన్, గుర్రమ్మ, రమాదేవి, ప్రమీళమ్మ, సీతమ్మ, అన్నపూర్ణ, శాంతి, రవి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రొద్దుటూరు : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద 27వ రోజు సమ్మెలో భాగంగా ఆదివారం అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఎస్మా జీఓ 2 పత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెన్‌ఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్‌వాడీల పట్ల ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, విజయ, శివమ్మ, గురుదేవి తదితరులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో ఎనలేని అభివృద్ధి



మున్నెల్లిలో నూతనంగా ప్రారంభించిన విద్యుత్ సబ్‌స్టేషన్

బి.కోడూరు : ఈ నాలుగున్నరేళ్ళ కాలంలో ఏ ప్రభుత్వంలో జరగనంత అభివృద్ధి బి.కోడూరు మండలంలో జరిగిందని సుమారు రూ.100 కోట్ల పైచిలుకు నిధులతో అనేక పనులు జరగడంతో ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో నీరు–చెట్టు, చెరువుల్లో పూడికతీత, వనం–మనం పేరిట టీడీపీ కార్యకర్తలు అభివృద్ధి చెందారే తప్ప మండలంలో ప్రజలకు ఉపయోగపడే ఏ ఒక్క అభివృద్ధి చేయలేదన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్ళ కాలంలో ప్రతి పంచాయతీకి సుమారు రూ.కోటి నిధులతో గ్రామాలకు పంచాయతీలకు తలమానికంగా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లు లాంటివి నిర్మించడమే కాకుండా ప్రతి పంచాయతీకి గడప గడపకు మన ప్రభుత్వం అనే పథకం ద్వారా రూ.20 లక్షలు నిధులతో పాటు ఎంపీ, డీఎంఎస్ తదితర నిధుల ద్వారా రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, విద్యుత్ ఆధునీకరణ తదితర అభివృద్ధి పనులను చేశారు. అలాగే బి.కోడూరు మండలంలోని మున్నెల్లి పంచాయతీ పరిధిలో చిన్నపాటి గాలి వీచినా ఆ పంచాయతీ పరిధిలోని సుమారు పది గ్రామాలు అంధకారంలో గడిపేవి. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఓ.ప్రభాకర్‌రెడ్డి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల దృష్టికి తీసుకెళ్ళగా వారు ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్ళారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 33/11 కె.వి. సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రారంభం కూడా చేశారు. మున్నెల్లి పంచాయతీలో రెండు రోజుల క్రితం ప్రారంభించిన సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్ సెంటర్లు గ్రామంలో పచ్చని చెట్ల మధ్య సుందరంగా దర్శనమిస్తున్నాయి. అలాగే బి.కోడూరు మండలానికి వరప్రసాదిని అయిన లోయర్ సగిలేరు ప్రాజెక్టు, ఎడమ కాలువను సుమారు రూ.86 కోట్ల నిధులతో 52 చెరువులను నెల రోజుల్లో నింపేలా కాలువ ఆధునీకరణ పనులు చేపట్టారు. ఈ పనులన్నీ కూడా సగానికి పైగా పూర్తి చేశారు. మిగతా పనులు పూర్తయితే వర్షాకాలంలో వచ్చే వరదనీటితో పాటు బ్రహ్మంసాగర్ నీటి ద్వారా నెల రోజుల్లోనే ఆయకట్టు చెరువులను నింపనుండటంతో మండల రైతాంగం ఆనందనం వ్యక్తం చేస్తున్నారు. పేరెన్నికగల పట్టణాలకు దీటుగా బి.కోడూరు మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నూతన భవనాలు రూపుదిద్దుకుంటున్నాయి.